ప్రజాశక్తి
మంగళవారం 1 ఆగస్టు 2023
5
శ్రీ సత్యసాయి

డెంగీతో చిన్నారి మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైం

డెంగీతో చిన్నారి మృతి చెందిన సంఘటన పుట్టపర్తి పట్టణంలో కుమ్మర వీధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కుమ్మరవీధికి చెందిన బాలచందర్ నవ్యశ్రీల కుమార్తె చైత్ర(10 నెలలు) తొమ్మిది రోజుల క్రితం జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం పుట్టపర్తి జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు వైద్య చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. శిశువుని అనంతపురం పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు జ్వరం ఎక్కువ అయ్యి తలకు సోకిందని కర్నూల్ లేదా బెంగళూరుకు తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో చిన్నారి మృతి చెందింది. కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యవంతం అయ్యారు.

ధర్నాలో మాట్లాడుతున్న జి.ఓబులు, ఎం.ఇంతియాజ్

రాయలసీమ ద్రోహి బిజెపి

- ◆ కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాల్సిందే
- ◆ ఉక్కు పరిశ్రమ సాధించేవరకు పోరాటం
- ◆ వైసిపి, టిడిపి, జనసేనలు కేంద్రాన్ని నిలదీయాలి
- ◆ కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విభజన హామీల్లో భాగంగా వెనుకబడిన రాయలసీమలో కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సి ఉండగా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాట తప్పి సీమకు తీరని ద్రోహం చేస్తోందని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పుట్టపర్తి బస్‌స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కడప ఉక్కు రాయలసీమ హక్కు అని, సీమకు ద్రోహం చేసిన బిజెపి, కేంద్ర ప్రభుత్వం నశించాలి అంటూ ర్యాలీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పెద్దన్న అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనకు ముందు తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేస్తామని బిజెపి నాయకులు ఇచ్చిన వాగ్దానాలను అడుగడుగునా తుంగలో తొక్కారన్నారు. సీమ ప్రజలను నమ్మించి మోసం చేయడానికి వైఎస్.రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, వైఎస్.జగన్మోహన్‌రెడ్డిలు కడప ఉక్కు పరిశ్రమకు మూడుసార్లు శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడేమో కేంద్రం కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని తేల్చిందన్నారు. 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచుతామని ప్రగల్బాలు పలికిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు కేంద్రం పెద్దలకు సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఇక ప్రతిపక్ష నేత చంద్రబాబు నాడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు సైతం కేంద్రానికి భజన చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని ఈ మూడు పార్టీలు ఈ విధానాలు మాని సీమప్రజల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ రాయలసీమకు మొదటి నుంచి పాలకులు మోసం చేస్తూనే ఉన్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసిన్ పరిశ్రమలు, టెక్స్‌టైల్ పార్క్ కర్నూలులో 400 కోట్లతో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వే కోచ్ నిర్మాణం, కడపలో ఉక్కు పరిశ్రమ ఇలా విభజన హామీలు అన్నింటినీ అమలు చేస్తామని బిజెపి పెద్దలు ప్రగల్బాలు పలికారన్నారు. ఇప్పుడేమో వీటిలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మొండి చేయి చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అన్యాయాన్ని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు ప్రశ్నించలేని స్థితిలో ఉండడం విచారకరం అన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ సాధించేవరకు సిపిఎం పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. శ్రామిక మహిళ సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్ మాట్లాడుతూ బిజెపికి సాగిలా పడుతూ రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు సీమకు తీరని ద్రోహం చేస్తున్నాయని చెప్పారు. విభజన చట్టం మేరకు హామీలను అమలు చేసేలా కేంద్రంలోని బిజెపిపై రాష్ట్ర పార్టీలు ఒత్తిడి పెంచాలన్నారు. లేకపోతే ఈ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, బాబావలి, సిఐటియు నాయకులు శ్రీనివాసులు, సాంబశివ, స్థానిక నాయకులు బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనానికి తగ్గుతున్న ఊతం

◆ ఏటా కేటాయింపుల్లో తగ్గుదల ◆ అందులోనూ 60 శాతంలోపే ఖర్చు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీ'గా అనంతపురం జిల్లాకు పేరు. ఎందుకంటే ఈ ప్రాంతం అనేక రకాలైన నాణ్యమైన ఉద్యానవన పంటలకు ప్రసిద్ధి. దేశ, విదేశాల్లోనూ ఇక్కడి ఉద్యానవన దిగుబడులకు గిరాకీ ఉంది. ఒక్క పండ్లే కాకుండా, పూలు, కాయగూరలు అన్నింటినీ మంచి డిమాండ్ ఉంటుంది. అటువంటి చోట ఉద్యానవన శాఖలకు కేటాయిస్తున్న నిధులు, చేస్తున్న ఖర్చు ఏటా తగ్గుతూ ఉండటం గమనార్హం. అధిక పెట్టుబడులయ్యే ఈపంటలకు ప్రోత్సహించేందుకు గతంలోనున్న రాయితీలను సైతం ఇప్పుడు తొలగించారు. రైతులే పూర్తి ఖర్చును భరించే పరిస్థితి నెలకొంది. ఇంత కష్టపడి పండించిన పంటలకు ఒక్కోసారి గిట్టుబాటు ధర లేకుండా కూడా పోతోంది.

తగ్గుతున్న ప్రభుత్వ ఊతం

ఉద్యానవన శాఖకు గడిచిన రెండేళ్లుగా చూస్తే బడ్జెట్ కేటాయింపులు, ఖర్చు తగ్గుతూ వస్తుండటం గమనార్హం. అనంతపురం జిల్లా వరకు చూస్తే 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.10.17 కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో ఖర్చు చేసింది చూస్తే రూ.6.11 కోట్లు మాత్రమే ఉంది. ఇందులో ప్యాక్ హౌస్‌లు, ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ రూమ్స్ ఇవేవి కూడా అనంతపురం జిల్లాలో గతేడాది ఒక్కటీ ఏర్పాటు చేయలేకపోయారు. కాయగూరలు, తీగజాతి పంట పెట్టేందుకు ప్రధానమైన ప్లాస్టిక్ మల్చింగ్ కూడా వెయ్యి హెక్టార్లకు ఇవ్వాల్సి ఉండగా 282 హెక్టార్లకు మాత్రమే ఇచ్చారు. ఇక ఈ ఏడాది రూ.11.18 కోట్లు కేటాయించారు. దీనిలో ఏ మేరకు ఖర్చు చేస్తారన్నది చూడాల్సి ఉంది. ఇక సత్యసాయి జిల్లాకు వస్తే 2022-23 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.13.32 కోట్లు కేటాయించి కేవలం రూ.3.44 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇక్కడ కూడా కలెటన్ కేంద్రాల ఏర్పాటు రూ.3.30 కోట్లు కేటాయించి రూ.38 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. కోల్డ్ రూమ్స్ కోటి రూపాయలు కేటాయింంచి నాలుగు లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఇక ఈ ఏడాది రూ.9.27 కోట్లు మాత్రమే కేటాయించి ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు లబ్ధిదారుల ఎంపికే పూర్తవలేదు.

ఉద్యానవన పంటలకు ప్రోత్సహకం అందివ్వాలి
శివారెడ్డి , ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్న ఉద్యానవన పంటలకు ప్రభుత్వం వైపు నుంచి మరింత ప్రోత్సహం అందివ్వాలి. గతంలో కొన్ని పంటలకు రాయితీలిచ్చే వారు. ఇప్పుడు అవి అందివ్వడంలేదు. తిరిగి అందివ్వాలి. ఈ పంటలను నిలువ చేసుకునేందుకు వీలుగా కోల్డ్ స్టోరేజీల నిర్మాణంతోపాటు గిట్టుబాటు ధర కల్పించే చర్యలు చేపట్టాలి. డ్రిప్, స్ప్రింక్లర్లను సబ్సిడీతో అందివ్వాలి. ఇక్కడి పండ్లకు మంచి గిరాకీ ఉన్న నేపథ్యంలో రైతులకు మరింతగా ప్రోత్సహం అందించి ఆదుకోవాలి.



తహశీల్దార్ సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మహాశక్తి చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న గుండుమల తిప్పేస్వామి

జగన్ పాలనలో పురోగతిలేని సాగునీటి ప్రాజెక్టులు

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ

జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యారని టిడిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె పార్థసారథి విమర్శించారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి మండల పరిధిలోని గొల్లపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు 10 రోజుల పాటు రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులను పరిశీలిస్తున్నారని, అందులో భాగంగా ఈ నెల 3వ తేదీ మండల పరిధిలోని కియా ఫ్యాక్టరీతో పాటు గొల్లపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తారని తెలిపారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం టిడిపి హయాంలో రూ. 62 వేల కోట్లు ఖర్చు చేశారన్నారను. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి కాంట్రాక్టర్, ప్రస్తుత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గొల్లపల్లి రిజర్వాయర్ పనులను 2 శాతం మాత్రమే పూర్తి చేయగా, టిడిపి అధికారంలోకి రాగానే 2016-18లో 98 శాతం పనులను పూర్తి చేశామన్నారు. అలాగే బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేసి మడకశిరకు నీళ్ల తీసుకెళ్లామన్నారు. నాలుగేళ్లలో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు వైసిపి ప్రభుత్వం నయా పైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రవిబాబు, కృపాకృష్ణమూర్తి, సామకోటి ఆదినారాయణ, మునిమడుగు చిన్న వెంకట రాముడు, కేశవయ్య, రఘువీరాచౌదరి, రామలింగనాయుడు, రవిశంకర్, సిద్ధలింగప్ప, నరహరి, లక్ష్మిరెడ్డి, సంజీవ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, బాబురెడ్డి, హుజూర్, ఖాదీర్, రియాజ్, బోయ గాయత్రి, రమేష్‌నాయుడు, గోపాల్, నరేంద్ర, నంజుండ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న బికె, టిడిపి శ్రేణులు

అర్హులకు నేతన్న నేస్తం అందజేయండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం అందజేయా లని కోరుతూ సోమవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండలంలో బలిజ, కాపు, రెడ్డి, తదితర కులాలకు చెందిన చేనేత కార్మికులకు అర్హత ఉన్నప్పటికీ నేతన్న నేస్తం అందలేదన్నారు. మూడేళ్లుగా వీరందరికీ నేతన్న నేస్తం అందించిన అధికారులు ఇప్పుడు ఎందుకు ఇవ్వలేదని డిమాండ్ చేశారు. అగ్రకులాల్లో కూడా ఎంతోమంది అర్హులైన చేనేత కార్మికులు ఉన్నారని వారందరికీ నేతన్న నేస్తం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమయ్య, వెంకటేష్, నారాయణస్వామి, కొండా వెంకటేష్, రంగప్ప, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'తో ప్రతి కుటుంబానికీ లబ్ధి

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి ప్రకటించిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ'లోని సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మండల పరిధిలోని గౌడనహళ్లి గ్రామంలో సోమవారం ఆయన మహాశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా బస్టాండ్ ఆవరణలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం గుండుమల తిప్పే స్వామి మాట్లాడుతూ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతున్నా ఒకొక్కరికి ఏడాదికి రూ. 15వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ. 1500, ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల మంది యువతకు ఉపాధి, నెలకు రూ. 3వేల నిరుద్యోగ భృతి, ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేల ఆర్థికసాయం, ఇంటింటికీ రక్షిత తాగునీటి కొళాయి తదితర పథకాలు అమలు చేస్తామని తెలిపారు. వైసిపిని, సిఎం జగన్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ఆదరిస్తారనా విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, తాలూకా మహిళా అధ్యక్షురాలు మీనాక్షి, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, తాలూకా తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల పరిధిలోని మైదుగోలం పంచాయతీలో రాష్ట్ర మహిళా కార్యదర్శి పరిమళ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు టిడిపి మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామాంజనమ్మ, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి, అధ్యక్షురాలు మాలక్క, పట్టణ అధ్యక్షురాలు విజయలక్ష్మి, మండల అధ్యక్షుడు జయప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు నాగలింగారెడ్డి, ఆవులరెడ్డి, మారుతి ప్రసాద్, చంద్ర, లక్ష్మిదేవి, రామచంద్రారెడ్డి, మూర్తి, ఖలీల్, ముబారక్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-పెనుకొండ

న్యాయవాది హత్యను ఖండిస్తూ సోమవారం పెనుకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నాగరాజు మాట్లాడుతూ విజయవాడలో న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబును హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే అలాగే అతడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. ఇటీవల న్యాయవాదుల మీద అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కావున ప్రత్యేక రక్షణ చట్టం ద్వారానే న్యాయవాదులకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం జడ్జి శంకర్రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగార్జున, సుదర్శన్‌రెడ్డి, శర్మ, లక్ష్మినారాయణ, శ్రీనివాసులు, అశ్వర్థనారాయణ, బాలాజీ, జావీద్, సోము, తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

స్పందనలో సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ కార్తికేయ

'స్పందన'లో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తికేయ మండల అధికారుల సమక్షంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించగా ప్రజలు సమస్యలు ఏకరువు పెట్టారు. ఇందులో పింఛన్ రావడం లేదని పెద్దమంతూరు పంచాయతీ కి చెందిన ఆదెమ్మ ఫిర్యాదు చేశారు. పెద్దగువ్వలపల్లి గ్రామంలో బావిని పూడ్చాలని అంజనరెడ్డి, గ్రామస్తులు అర్జీ అందజేయగా, పూడ్చడానికి నిధులు లేవని, ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒని ఆదేశించారు. రొద్దంలో ఆర్‌డిటి సహకారంతో ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీకి అనుసంధానం చేసిన శుద్ధ జల కేంద్రాన్ని వెంటనే పునరుద్ధరించాలని, మురుగు కాలువలు, రొద్దం చిన్నచెరువు మరువ మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతాచారి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రొద్దం : మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో ఎంపియుపి పాఠశాల ముందు నడిరోడ్డు(సీసీ రోడ్డు)లో విద్యుత్ స్తంభం ఉంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే సమయంలో వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం పొంచి ఉంది. కావున విద్యత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ స్తంభాన్ని మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభం

పేదలకు న్యాయం జరిగేంతవరకు పోరాటం

◆ వ్యకాసం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయిపు ◆ అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని అధికారుల హామీ

పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించిన వ్య.కా.సం, సిఐటియు నాయకులు, లోపలికి వెళ్తున్న నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేంత వరకూ పోరాటం కొనసాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సహాయ కార్యదర్శి గంగాధర్, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవా రం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ప్రజలతో కలిసి 2 గంటల పాటు బైఠాయించి తమకు న్యాయం చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ స్పందించక పోవడంతో వారందరూ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా సిఐ కరుణాకర్, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు తిరిగి కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేయగా స్పందిం చిన సబ్ కలెక్టర్ 10 మందిని లోపలికి రావాలని కోరినా వారు వినలేదు. ఇంతలో డిఎస్‌పి హుస్సేన్‌పీరా అక్కడి చేరుకొని నాయకులకు సర్ది చెప్పి కొందరిని లోపలికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ సచివాలయంలో అర్జీలు ఇచ్చిన తర్వాత 90 రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెలు తొలగించి అధికారులకు సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కియా, సోమందేపల్లి ఎస్ఐలు వెంకటరమణ, విజయ్‌కుమార్, పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, తిప్పన్న, నరసింహా, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, తిప్పన్న, మహిళలు పాల్గొన్నారు.

కౌన్సిల్ మీ(హీ)ట్

'పురం' వైసిపిలో ఎత్తులకు పై ఎత్తులు

బిసి ప్రథమ పౌరురాలికి అవమానం

కోరంతో సమావేశాన్ని నిర్వహించిన ఛైర్‌పర్సన్

సభను నిర్వహిస్తున్న ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి- హిందూపురం

హిందూపురం వైసిపిలో ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. చివరకు ప్రజా సమస్యలను చర్చించాల్సిన కౌన్సిల్ సమావేశం అంశంలో సైతం అధికార పార్టీలో రెండు వర్గాలుగా విడిపోయారు. సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ ముందస్తుగా సమాచారం ఇచ్చినప్పటికి అధికార పార్టీలో ఉన్న 29 మంది కౌన్సిలర్లలో 22 మంది గైర్హాజరయ్యారు. వీరితో పాటు ఎంఐఎం-1, బిజెపి-1, స్వతంత్ర అభ్యర్థి ఒకరు హాజరు కాలేదు. ఛైర్‌పర్సన్‌తో కలుపుకుని ఏడుగురు వైసిపి, టిడిపి నుంచి ఆరుగురు కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. కోరం ఉండడంతో ఛైర్‌పర్సన్ ఇంద్రజ సభ నిర్వహణకు ముందుకు వచ్చారు. అయితే మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ కోరం లేదని చెప్పి సమావేశం నుంచి వెళ్లి పోయారు. ఈయనతో పాటు మున్సిపల్ అధికారులు సైతం వెళ్లి పోయారు. అధికారులు లేక పోయినప్పటికి ఛైర్‌పర్సన్ అజెండాతో పాటు ఇతర ప్రజా సమస్యలపై చర్చించి సభను నిర్వహించారు.

హిందూపురం అధికార వైసిపిలో రోజు రోజుకు వర్గ విభేధాలు హెచ్చుమీరుతున్నాయి. ఒకరిపై ఒకరు ఆధిక్యాన్ని చాటుకోవడానికి ఎత్తుకు పై ఎత్తులు వేసుకుంటున్నారు. సోమవారం ఉదయం 10 : 30 గంటలకు జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని ఎలాగైన వాయిదా వేయించాలని ఇన్‌చార్జ్ వర్గం తీవ్ర ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా ఇన్‌చార్జ్‌తో పాటు ముఖ్య నాయకులు తేనేటి విందు పేరుతో కొంత మంది కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి సభకు హాజరు కాకుడదని కోరినట్లు సమాచారం. ఛైర్‌పర్సన్‌తో పాటు సభకు హాజరు అయిన ఆరుగురు కౌన్సిలర్లను సభ నుంచి తప్పించడానికి నాయకులతో పాటు మరో ఇద్దరు కౌన్సిలర్లు తీవ్ర ప్రయత్నం చేశారు. అయితే సాధ్యం కాక పోవడంతో కౌన్సిల్ హాలులో కూర్చొన్న మున్సిపల్ కమిషనర్‌పై ఒత్తిడి తెచ్చి, సభను వాయిదా వేసి బయటకు రావాలని హుకుం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇన్‌చార్జ్ వర్గం నేతల ఒత్తిడితో కమిషనర్ ఉదయం 10 : 30 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉంటే 11గంటలు అయిన ప్రారంభం కాలేదని, సమావేశానికి కోరం లేదని కమిషనర్ అతనికి అధికారం లేక పోయిన సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు మినిట్ పుస్తకంలో రాసి వెళ్లి పోయారు. దీంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ స్పందించి సభకు అందరు వస్తున్నారు, కాస్త వ్యవధి ఇవ్వాలని హాజరు అయిన కౌన్సిలర్లతో కలసి కమిషనర్‌ను అభ్యర్ధించినప్పటికీ కమిషనర్‌తో పాటు అధికారులు వెళ్లి పోయారు. సభ సాక్షిగా ఒక బిసి మహిళా ఛైర్‌పర్సన్‌ను ఘోర అవమానం జరిగింది.

టిడిపి కౌన్సిలర్లు ఆందోళన

కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని టిడిపి కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్ పోడియం ముందు బైటాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా టిడిపి కౌన్సిలర్లు రమేష్ కుమార్, రాఘవేంద్ర, సతీష్ కుమార్, మహాలక్ష్మి, మంజుళ, భారతి మాట్లాడుతు కౌన్సిల్ చరిత్రలోనే ఇప్పటి వరకు ఎప్పుడు నిర్ణయించిన సమయంలో సమావేశాన్ని నిర్వహించలేదన్నారు. ప్రతి సమావేశం ఉదయం 10 : 30 గంటలకు నిర్ణయిస్తే 11 గంటల పైనే సభ ప్రారంభం అయిందన్నారు. ఎప్పుడు లేని విధంగా ఇప్పుడు సభను ఎలా వాయిదా వేస్తారని ప్రశ్నించారు. కమిషనర్‌కు సభను వాయిదా వేసే అధికారం ఏ చట్టం ఇచ్చిందని ప్రశ్నించారు. కమిషనర్‌తో పాటు అధికారులు అందరు రావాలని, సభను నిర్వహించాలని డిమాండ్ చేశారు. చివరకు సమావేశం నిర్వహిస్తామని ఛైర్‌పర్సన్ ఇంద్రజ చెప్పడంతో వారు ఆందోళన విరమించి వారికి కేటాయించిన సీట్లల్లో కూర్చొన్నారు.

అధికారులు లేకుండానే సభ నిర్వహణ

కౌన్సిల్ మీట్ నిర్వహణకు కోరం ఉండడంతో కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు లేక పోయినప్పటికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి రావాలని కమిషనర్‌కు పోన్ చేసినప్పటికి ఆయన స్పందించలేదు. సమావేశానికి రాలేదు. ఆయనతో పాటు అధికారులు ఎవరు హాజరు కాలేదు. అయినప్పటికి ఛైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు అజెండాలోని 16 అంశాలపై సమగ్రంగా చర్చించి అమోదం తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రమేష్ కుమార్ వినాయక చవితి పండుగను పురష్కరించుకుని గుడ్డం కోనేరును అన్ని విదాల అభివృద్ధి చేయాలని కోరారు. కోనేరును పరిశీలన చేసి, నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని ఛైర్‌పర్సన్ ఇంద్రజ హామీ ఇచ్చారు. కౌన్సిలర్ రాఘవేంద్ర మాట్లాడుతు తన వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. కౌన్సిలర్ ఇర్షాద్, ఆయూబ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చించే సమయంలో కోరం ఉన్నప్పటికి అధికారులు సభను అవమానించే విధంగా కోరం లేదని చెప్పి, సభ నుంచి వెళ్లి పోయారని,కమిషనర్ పై శాఖ పరమైన చర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని తీర్మానం చేయాలన్నారు. దీంతో అందరు దీనికి అమోదం తెలిపారు. కౌన్సిల్ ను అవమానించి, సభను సైతం లెక్క చేయకుండా సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి సభనుంచి వెళ్లి పోయిన కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తో పాటు మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం అన్నారు. సోమవారం కౌన్సిల్ సమావేశం అనంతరం ఛైర్‌పర్సన్ ఇంద్రజ తన చాంబర్ లో హాజరైన కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ నిబంధనల మేరకు సమావేశాన్ని వాయిదా, రద్దు చేసే అధికారం కమిషనర్‌కు లేదన్నారు. ఇది తెలినప్పటికీ ఆయన ఏ అధికారంతో సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. సభకు హాజరు అయిన అధికార, ప్రతి పక్ష పార్టీ కౌన్సిలర్లు అందరం కలిసి కలెక్టర్ తో పాటు మున్సిపల్ ఉన్నతాధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఇర్షాద్, నాసీరా బాను, రేష్మా, అయూబ్, ముస్తక్ తదితరులు పాల్గొన్నారు.

సభలో నుంచి వెళ్లి పోతున్న అధికారులు

ఆ రెండు గ్రామాలను గుర్తించండి

ముదిగుబ్బ : మండలంలోని పెద్ద చిగుళ్ల రేవు , రాఘవంపల్లి గ్రామాలను అధికారులు గుర్తించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు వారు సోమవారం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రెండు గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించడంతో తమకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. తమపేర్లు ఓటరు జాబితా నుండి కూడా తొలగించారని వాపోయారు. తమలో ఎక్కువమంది సొంతగృహాలను నిర్మించుకున్నా మన్నారు. రీ సెటిల్మెంట్ అయిన ప్రాంతాలలో త్వరితగతిన ఇంటి నెంబర్లు కేటాయించి రాబోవు శాసనసభ పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తహశీల్దార్ నాగేంద్ర, డిప్యూటీ తహశీల్దార్ ప్రసన్నకుమార్‌ను వినతిపత్రం ద్వారా కోరారు ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులతో పాటు నాయకులు నారాయణస్వామి, దేవేందర్ రెడ్డి, గణపర్తి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

గాండ్లపెంట : మండల పరిధిలోని బనాన్ చెరువుపల్లిలో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. గడపగడప మన ప్రభుత్వం నిధులతో చేపడుతున్న ఈ పనులను ఎంపిపి జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కళావతి, వైస్ ఎంపిపి భారతి, పిఆర్ జెఇ రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

హిందూపురం : సిప్ అబాకస్ అకాడమి వారు విజయవాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో హిందూపురం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు సిప్ అబాకస్ నిర్వహకురాలు మాలతి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 900 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో హిందూపురం నుంచి 57 మంది విద్యార్థులు పాల్గొనగా 45 మంది ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు.

మహారాజశ్రీ పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
O.S.NO:115/2021.
Between:
వై.సత్యనారాయణ ...వాది
మరియు
ఎ.రాంబాబు ...ప్రతివాది
ప్రతివాదికి నోటీసు
To,
ఎ.రాంబాబు తండ్రి : ఆది ఆంధ్ర గంగాద్రి, వయస్సు:40 సం॥లు, నివాసం డోర్ నెం:5-73, పెదపల్లి గ్రామము మరియు పోస్టు, పుట్టపర్తి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 23-08-2023వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా కానీ, లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
శ్రీ.పి.ప్రసాద్, అడ్వకేటు, పుట్టపర్తి

మహారాజశ్రీ పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
I.A.NO:140/2021 in O.S.NO:45/2021.
Between:
ఒంటికొండ చంద్రశేఖర్ ...వాది
మరియు
1.కరణం @ కొత్తచెరువు సుబ్రమణ్యేశ్వర రావు
2.కరణం @ కొత్తచెరువు రామకృష్ణ
3.కరణం @ కొత్తచెరువు దామోదర రావు
4.కేసనపల్లి కాశివిశ్వనాథ్ రావు
5.శ్రీమతి కేసనపల్లి సుబ్బలక్ష్మి ...ప్రతివాదులు
ప్రతివాదులకు నోటీసు
To,
1.కరణం @ కొత్తచెరువు సుబ్రమణ్యేశ్వర రావు, తండ్రి లేటు కరణం @ కొత్తచెరువు శంకర నారాయణ రావు, వయస్సు 37 సం॥లు, వ్యవసాయం, పంచాయతీ ఆఫీసు దగ్గర, కర్ణాటక నాగేపల్లి రోడ్డు, పుట్టపర్తి, శ్రీ సత్యసాయి జిల్లా.
2.కరణం @ కొత్తచెరువు రామకృష్ణ తండ్రి లేటు కె.రాజగోపాలరావు, వయస్సు:63 సం॥లు, శివాలయం వీధి దగ్గర, పుట్టపర్తి, శ్రీ సత్యసాయి జిల్లా.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 23-08-2023వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా కానీ, లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
శ్రీ.పి.ప్రసాద్, అడ్వకేటు, పుట్టపర్తి

మణిపూర్ మారణహోమాన్ని ఆపండి

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మణిపూర్ రాష్ట్రంలో గత మూడు నెలలగా సాగుతున్న మారణ హోమాన్ని ఆపాలని సిపిఎం నాయకులు కోరారు. పుట్టపర్తి ప్రశాంతి గ్రామ్‌లోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్ రాష్ట్ర నాయకులు ఓబులు, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మణిపూర్ ఘటనకు సంబంధించిన లక్ష కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఓబులు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో సాగుతున్న మారణకాండలో 145 మంది బలి అయ్యారని వేల మంది గాయాలతో ఆసుపత్రి పాలయ్యారని అన్నారు. ఐదువేలకు పైగా ఇళ్లు కాలి బూడిద అయ్యాయని, 60వేల సొంత రాష్ట్రంలోనే శరణార్థులుగా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన కుకీ మహిళలను పోలీసులు సమక్షంలోనే మతోన్మాదులు నగ్నంగా ఊరేగించి వారిపై సామూహిక అత్యాచారం చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలియజేసేందుకు సిపిఎం కరపత్రాలను ముద్రించి ప్రజల్లోకి తీసుకు వెళ తూందని చెప్పారు. మణిపూర్లో బిజెపి కొన్ని వర్గాల మధ్య చిచ్చు లేపి, జాతుల మధ్య వైరం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. ఇలాంటి మతోన్మాద చర్యలకు చమర గీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ప్రశాంతి గ్రామ్, మామిల్లకుంట క్రాస్, యనమలపల్లి, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రవీణ్ కుమార్, సిద్దు, రామచంద్ర, సిఐటియు నాయకులు బాబావలి, గంగాధర్, అంజి, ప్రజా సంఘాల నాయకులు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిద్దామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, కమిషనర్ బండిశేషన్న పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఛైర్‌పర్సన్ కాచర్లలక్ష్మీ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని 72 అంశాలను సిబ్బంది చదివి వినిపించగా కౌన్సిలర్లు ఆమోదించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా వీధిలైట్లు, కుక్కబెడద తదితర సమస్యలను కౌన్సిలర్లు ప్రస్తావించగా వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల గురించి కమిషనర్ బండిశేషన్న వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కౌన్సిలర్ పట్టణ పరిశుభ్రతకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఇంటింటి చెత్త సేకరణ ప్రతి రోజు చేపడుతామన్నారు. చెత్తపన్నులు మాత్రం సక్రమంగా వసూళ్లు కాలేదని ఈవిషయంలో కౌన్సిలర్లు కూడా సహకరించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్లు జయరామిరెడ్డి, షేక్ షంషాద్ బేగం, ఈఈ సత్యనారాయణ, మేనేజర్ ఆనంద్, డీఈ వన్నూర్ స్వామి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మహబూబ్‌బాషా, శ్యాంసన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ

వాడీవేడిగా కౌన్సిల్ మీట్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలో నెలకొన్న సమస్యలు, అక్రమ వెంచర్లపై కౌన్సిల్ సమావేశంలో వాడీవేడి చర్చ కొనసాగింది. సోమవారం కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ నజీమున్నీసా సాదిక్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కళ్యాణ్ మాట్లాడుతూ కదిరి పట్టణం గట్ల వద్ద గల టిడ్కో గృహాలకు సంబంధించి అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న సీఎల్డీపీ లబ్ధిదారుల నుండి అక్రమ వసూలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కౌన్సిల్ అనుమతి లేకుండా గతంలో కేటాయించిన లబ్ధిదారులకు కాకుండా ఇతరులకు గృహాలు కేటాయిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా కొందరు లబ్ధిదారుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని విధులు సక్రమంగా నిర్వహించడం లేదని మున్సిపల్ కమిషనర్ అధికారులు స్పందించి సిఎల్ డిపి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైస్ ఛైర్మన్ రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు కిన్నెర కళ్యాణ్ ,ఇస్మాయిల్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో వందమంది దాకా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని అధికారులు రికార్డుల్లో నమోదు చేస్తున్నప్పటికీ సిబ్బంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. కౌన్సిలర్ ఫయాజ్ మాట్లాడుతూ మున్సిపల్ నిబంధనలు పాటించకుండా ఎలాంటి అనుమతులు పొందకుండా విచ్చలవిడిగా లేఅవుట్లు వెలుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్లు రాజశేఖర్ రెడ్డి, గంగాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, టౌన్ ప్లానింగ్ అధికారులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను మండల స్థాయిలోనే పరిష్కరించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జగనన్నకు చెబుదాం, స్పందన ఫిర్యాదులను మండల స్థాయిలోనే పరిష్కరించే విధంగా తహశీలార్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ లో పాల్గొన్న కలెక్టరు ప్రజల నుంచి 197 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్‌ఒకొండయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జగనన్న సురక్ష అమలులో రాష్ట్రంలోనే సత్యసాయి జిల్లా మూడవ స్థానాన్ని దక్కించుకోవడం విశేషమన్నారు. వాలంటీర్లు ఇంటి ఇంటి సర్వే 80 శాతం పూర్తి చేశారన్నారు. మిగిలిన 20 శాతం త్వరగా పూర్తి చేయాలన్నారు. ముదిగుబ్బ, మడకశిర, తలపుల, రొళ్ళ, కదిరి, ఎన్ పి కుంట మండలాలు వెనుకబడి ఉన్నాయని ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, డిపిఒ విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ద్వామా పీడీ రామాంజనేయులు, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, ల్యాండ్స్ సర్వే ఏడీ రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ అధికారి శివ రంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : మాజీ మంత్రి

ప్రజాశక్తి-రామగిరి

టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని నసనకోట పంచాయతీ పరిధిలోని ముత్యాలంపల్లి గ్రామంలో పరిటాల సునీత మండల, స్థానిక నాయకులతో కలసి ఇంటింటికి తిరుగుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నసనకోట సర్పంచి లలితమ్మ, , సీనియర్ నాయకులు రామ్మూర్తి నాయుడు, తెలుగు యువత అధ్యక్షులు ఎల్ శ్రీధర్ నాయుడు, ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పోతన్న, ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటరాముడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, డీలర్ నారాయణప్ప, ముత్యాలప్ప, రవి, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గాంధీ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహానికి వినతిని అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపతి, ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి డివిజన్ నాయకులు మాట్లాడుతూవిద్యుత్ రంగంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలను అన్నిటిని పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం డివిజన్‌లోని ఇంజనీర్లు, విద్యుత్ ఉద్యోగులు, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నిరసన

పుట్టపర్తి క్రైమ్ : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. సోమవారం కర్నాటక నాగేపల్లి కి వెళ్లే రహదారిలో ఆ పార్టీ పట్టణ కన్వీనర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మంత్రి మోపిదేవి వెంకటరమణ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపి వారికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిసిలపై జరుగుతున్న దాడులను లోకేష్ తీవ్రంగా ఖండించారన్నారు. అక్కను వేధిస్తున్నారని నిరసన తెలిపిన ఆమె తమ్ముడిపై వైసిపి రౌడీ మూకలు పెట్రోలు పోసి తగలబెట్టారన్నారు. ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని లోకేష్ ఖండిస్తూ బాధితులకు భరోసా కల్పించారన్నారు. వీటిపై వైసిపి నాయకులు లోకేష్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు. బి సి లకు అన్యాయం జరుగుతుంటే వైసిపిలో ఉన్న బి సి నాయకులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో బిసి నాయకులు ఎల్ఐసి నరసింహులు, పల్లపు రవీంద్ర, అంజినప్ప, టిడిపి నాయకులు రత్నప్ప చౌదరి, చీమిరాల సుధాకర్, అంబులెన్స్ రమేష్, గుట్లపల్లి గంగాధర్, శ్రీరాములు, చంద్ర, కేశవ పాల్గొన్నారు.

చీనీ చెట్లు నరికివేత

బత్తలపల్లి : మండలంలో అధికార పార్టీకి చెందిన వారి చీనీచెట్లు నరికి వేయడం మండలంలో చర్చనీయాంశమైంది. బత్తలపల్లి వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఎంపీపీ బగ్గిరి త్రివేణిరెడ్డి దంపతులు సాగు చేస్తున్న చీనీచెట్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. తాడిమర్రి మండలం ఎం అగ్రహారం రెవెన్యూ గ్రామ పొలంలోనినాలుగు ఎకరాల భూమిలో రెండు సంవత్సరాల నుంచి 650 చీనీచెట్లను సాగుచేస్తున్నారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు పొలంలో క్రిమిసంహారకమందు పిచికారి చేయడానికి వెళ్లి నరికివేతకు గురైన చీనీచెట్లను గుర్తించారు. విషయం తెలుసుకున్న కన్వీనర్ బయపరెడ్డి వెంటనే పొలం వద్దకు వెళ్లి పరిశీలించి సుమారుగా 100 చీనీ చెట్లు నరికివేతకు గురైనట్లు గుర్తించారు.ఈ విషయమై తాడిమర్రి పోలీసులకు బాధిత రైతు బయపరెడ్డి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న తాడిమర్రి ఎస్ఐ లక్ష్మీనారాయణ, పోలీసులు సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నరికివేసిన చీనీచెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

పచ్చని చెట్లను నరకడం పిరికిపందల చర్య : తమను ధైర్యంగా ఎదుర్కోలేక పచ్చని చెట్లను నరికివేయడం పిరికిపందల చర్యల అని వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి విమర్శించారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తన ఆర్థిక మూలాలను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే చెట్లను నరికి వేశారని అన్నారు. తనకు జరిగిన అన్యాయాన్నిధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు.

సుద్దకుంటపల్లిలో అగ్ని ప్రమాదం

రూ. 5 లక్షల ఆస్తినష్టం

సోమందేపల్లి : మండల పరిధిలోని సుద్దకుంటపల్లిలో సోమవారం కూలీ మావటూరు అంజనప్ప ఇంటిలో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. భార్యతో కలిసి అంజనప్ప కూలి పనులకు వెళ్లగా కుమారుడు మూర్తి గొర్రెలు మేపడానికి, కోడలు గ్రామంలోనే పట్టుగూళ్లు విడిపించే పనికి వెళ్లింది. మూర్తి పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత ఇంట్లో ఉంటారనే ఉద్దేశంతో తాళం వేయకుండా వెళ్లిపోయారు. మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో అంజనప్ప భార్య భోజనానికి ఇంటికి వచ్చి వాకిలి తెరవగానే బీరువాలో దుస్తులతో పాటు ఇంట్లోని సామగ్రి మంటల్లో కాలిపోతూ కనిపించాయి. దీంతో ఆమె స్థానికుల సాయంతో మంటలు ఆర్పాని, అప్పటికే బీరువాలో ఉంచిన రూ. 60 వేల నగదు, 5 తులాల బంగారు, విలువైన దుస్తులు, 5 ప్యాకెట్ల బియ్యం, రెండు ప్యాకెట్ల రాగులు కాలిబూడిద కావడంతో రూ. 5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. అయితే ప్రమాదంపై బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

గుడిబండ : మండల పరిధిలోని పలారం గ్రామానికి చెందిన కదిరప్ప కుమారుడు నరసయ్య(45) సోమవారం ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయం గ్రామ సమీపంలోని ఓ పొలంలో బహిర్భూమికి వెళ్లిన నరసయ్య బావిలో దిగాడు. అయితే ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలోకి పడి మృతి చెందాడు. అతడి భార్య లక్ష్మక్క ఫిర్యాదు మేరకు ఎస్ఐ మునిప్రతాప్, సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని మడకశిర ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూర్ఛతో వృద్ధుడు..

మండల పరిధిలోని సింగేపల్లి గ్రామానికి చెందిన దాసప్ప(75) గుడిబండలో బస్సు దిగుతుండగా ఫిట్స్(మూర్ఛ) వచ్చి కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. దాసప్ప ఉదయం సింగేపల్లి క్రాస్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి గుడిబండకు చేరుకొని బస్టాండ్‌లో బస్సు దిగుతున్న సమయంలో ఫిట్స్ రావడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుమారుడు శివలింగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు,

జెసిబి సీజ్

పరిగి : మండలంలోని శాసనకోట నదీ ప్రాంతంలో అక్రమంగా మట్టి తరలింపునకు ఉపయోగిస్తున్న జెసిబిని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు సీజ్ చేశారు.అనుమతులు లేకుండా జెసిబి సాయంతో ట్రాక్టర్లతో ప్రభుత్వ స్థలంలో మట్టి తరలించడంపై అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఈ మేరకు జెసిబి ని సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. జెసిబిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

ధ్వంసమైన మొక్కజొన్న పంట పరిశీలన

సోమందేపల్లి : మండల పరిధిలోని రేణుకానగర్ గ్రామంలో రైతు వెంకటేష్‌కు చెందిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ధ్వంసం చేసిన మొక్కజొన్న పంటను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సదితమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చి ఎన్ని రోజులైనా రోడ్డు వేయకపోవడంతో స్థానిక టిడిపి నాయకులు వెంకటేష్ సొంత నిధులతో మట్టి తోలించాడన్నారు. ఇది ఓర్చుకోలేని వైసిపి నాయకులు రాత్రి వేళ మొక్కజొన్న పంటను ధ్వంసం చేశారని మండిపడ్డారు. పంటను ధ్వంసం చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, రంగప్ప, మాగేచెరువు సర్పంచి నరసింహులు, ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మంజునాథ్, శ్రీధర్, రంగనాథ్, ఆది, వెంకటేష్, హేమంత్, మద్దిలేటి, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ కంపెనీ పై ఎస్పీకి ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల లో నిర్వహిస్తున్న ఒక చిట్ ఫండ్ కంపెనీ తమకు రావాల్సిన డబ్బు ఇవ్వకుండా నెలలు గడుపుతోందని బాధితులు స్థానిక ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. గోరంట్ల, పుట్టపర్తి కొత్తచెరువు, ధర్మవరం, చిలమత్తూరు మండలాల్లో ఎంతోమంది ఖాతాదారులకు డబ్బు ఇవ్వకుండా జాప్యం చేయడమే కాక కార్యాలయానికి తాళాలు వేసి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకున్నారని వాపోయారు. ఈ విషయంలో పలువురు ఇదివరకే ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదే క్రమంలో మండల పరిధిలోని పెడపల్లి ఆర్ఎంపి రాఘవేంద్ర సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుండి 60 పిటీషన్లు స్వీకరించారు. వారి ముందే సంబంధిత స్టేషన్ అధికారి కి ఫోన్ చేసి స్పందన ఫిర్యాదులను మొదటి ప్రాధాన్యత గా తీసుకొని సమస్యను త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ స్పందన కార్యక్రమం లో ఎక్కువగా రస్తావివాదాలు, కుటుంబ కలహాలు, అదనపు కట్నం కోసం భర్త/అత్తారింటి వేదింపులు, ఉద్యోగ మోసాలు, భూవివాదాలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు, సంబంధిత సమస్యలతో ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. పోలీసు పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులకు ఫోన్ లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ విష్ణు, లీగల్ అడ్వైజర్ సాయి నాథ్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆస్తులు కాజేయడానికే చంపేశారు'

ఎస్పీకి మృతుని భార్య ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్ : తన భర్త జావీద్ ఆస్తులు కాజేయడానికి తన మామ నజీర్, అతని బంధువులు కలిసి తన భర్తను చంపేసి సాధారణ మరణం గా చెబుతున్నారని హిందూపురం కోటా ఏరియా కు చెందిన సాదకున్నీసా అనే మహిళ ఎస్పీ మాధవ రెడ్డి కు ఫిర్యాదు చేసింది. 2017 లో జావీద్‌తో తనకు వివాహం కాగా 2019 లో హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అత్తింటి వారి వేధింపులపై ఫిర్యాదు చేసినట్లు సాదకున్నీసా తెలిపింది. కాగా అప్పటి నుంచి తనను మరింత వేధిస్తు తన భర్త కు చెందిన ఆస్తులను తన మామ నజీర్ రాయించుకున్నారని ఆరోపించారు. అయితే జూలై 17న తన భర్త అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని చనిపోయేందుకు 25 రోజుల క్రితం తన భర్తకు చెందిన రూ. 35 లక్షల ఆస్తిని తన మామతో పాటు ప్యారు, గోవిందప్ప అనే వ్యక్తులు అమ్మేశారని బాధితురాలు వాపోయింది. కనీసం తన భర్త మృతి చెందిన విషయం తెలపకుండా దాచిపెట్టారని కన్నీళ్లపర్యంతం అయింది. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని కావున విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని బాధిత మహిళ కోరింది.

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేయండి

ప్రజాశకి - ముదిగుబ్బ

ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని సిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు చల్లా శ్రీనివాసులు.మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేసి రైతులకు కూలీల కొరత లేకుండా చేయాలని సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రజానాట్యమండలి బాబు, హోటల్ తిప్పయ్య, శ్రీరాములు, తుమ్మల చిన్నప్ప, లింగప్ప, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

ముగిసిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజిఎం మైదానంలో నాలుగు రోజులుగా ఆర్‌డిటి ఆధ్వర్యంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ కప్ టోర్నమెంట్‌ను హిందూపురం క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహించారు. ఈ టోర్నీలో 12 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీల్లో చిన్మయ, రినౌల్డ్ పాఠశాలల జట్లు తలపడగా రినౌల్డ్ జట్టు విజయం సాధించింది. కర్నాటక ప్రీమియం లీగ్ ప్లేయర్లు వెంకి సచిన్, రాఘవేంద్ర విజయం సాధించిన జట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ముస్తఫా ఆలి ఖాన్, హెచ్ఎం బిబి హాజిరా, కోచ్ సల్మాన్ ఖాన్, ఉపాధ్యాయులు సర్ఫరాజ్, సాఖబ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల సాకుతో అర్హులకు అన్యాయం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

నిబంధనల సాకుతో అర్హులకు సంక్షేమపథకాలను దూరం చేస్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం పట్టణంలోని 17, 37వ వార్డులలో ఇంటింటికి తిరుగుతూ తొలి మ్యానిఫెస్టో పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అసమర్థ, అవినీతి ప్రభుత్వం పాలిస్తోందన్నారు. చంద్రబాబునాయుడు అమరావతి రైతుల ద్వారా 34వేల ఎకరాలను సేకరిస్తే వైసీపీ అందులో ఒక్క ఎకరాన్ని కూడా అభివృద్ధి చేయలేక చేతులెత్తేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టును 70శాతం చంద్రబాబు పూర్తిచేస్తే జగన్ నాలుగేళ్లలో ఐదు శాతం కూడా చేయలేకపోయారని విమర్శించారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. అవినీతి పాలనకు రోజులు దగ్గర పడ్డాయని జోస్యం చెప్పారు. ధర్మవరంలో టీడీపీ జెండా ఎగరాలని పరిటాల శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాయల అశ్వర్థనారాయణ, గడ్డంరవి, ఓంప్రకాశ్, కొత్తపేట ఆది, మునిస్వామి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

విద్యార్థుల బస్సు పాసులకు ఆర్థికసాయం

పుట్టపర్తి రూరల్: పెడపల్లి ఉన్నత పాఠశాల లో చదువుతున్న 70 మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రాయితీ బస్సు పాసులకు పొందడానికి వైసిపి నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు వైసిపి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు పెడపల్లి తిరుపాల్ నాయక్ పదివేల రూపాయలను పుట్టపర్తి డిపో ఆర్టీసీ సిబ్బందికి అంద జేశారు.గ్రామీణ ప్రాంతాల నుండి పెడపల్లి ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులకు రాయితీ బస్సులను సోమవారం మంజూరు చేశారు. పెడపల్లి ఉన్నత పాఠశాల నుండి గంగంపల్లి గంగంపల్లితండా, గోపి దేవరపల్లి గ్రామాలకు, అదేవిధంగా మార్లపల్లి కోనాపురం రాచువారి పల్లి గ్రామాలకు వెళ్ళు విద్యార్థులకు ఈ బస్సు పాసుల సౌకర్యం కల్పించారు. విద్యార్థులకు ఈ సౌకర్యం కల్పించిన ఆర్టీసీ సిబ్బందిని, విరాళం అందజేసిన ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుపాల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్ర రెడ్డి సిబ్బంది అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, చన్నకృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, వైసీపీ నాయకులు శ్రీనివాస్ నాయక్, ఆర్టీసీ సిబ్బంది శ్రీనివాసులు, శివశంకర్ ,శ్రీ రామ్ నాయక్ పాఠశాల కమిటీ చైర్మన్ కిరణ్ కుమార్ నాయక్ , బత్తలపల్లి గోవింద నాయక్ ,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి బస్సు పాస్ అందజేస్తున్న దృశ్యం

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

పుట్టపర్తి అర్బన్ : మధ్యాహ్న భోజనం పథకం లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనలు ఇవ్వాలని వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆ పథకం యూనియన్ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. సిఐటియు అనుబంధంగా ఉన్న ఆ యూనియన్ నాయకుడు నారాయణ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఇందులో పనిచేస్తున్న కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారికి కనీస వేతనాలు అమలు పరచాలని, ప్రతినెల 5వ తేదీ లోపల బిల్లులు మంజూరు చేయాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట ప్రమాదానికి గురైతే ఆ కుటుంబానికి 20 లక్షలు ఇస్తూ, ఆ ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

రొద్దం : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన గర్భిణులకు సోమవారం ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టిడిపి రాష్ట కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ప్రతి నెలా భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, ట్రస్ట్ డైరెక్టర్ క్రిష్టప్ప, టిడిపి నాయకులు తిరుపాల్‌నాయుడు, చెన్నకేశవులు, మోపర్లపల్లి లింగప్ప, తదితరులు పాల్కొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

మడకశిర : రొళ్ల మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, మట్కా, గ్యాంబ్లింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటరాముడు హెచ్చరించారు. మండలం ఇరువైపులా కర్నాటక ప్రాంతం ఆనుకొని ఉందని సరిహద్దు ప్రాంతంలో కూడా ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు చేపడితే ఉపేక్షించేది లేదన్నారు. కర్నాటక మద్యం ఆంధ్రలోకి తెచ్చినా కేసులు పెడతామన్నారు. ఇప్పటికే సిబ్బందితో మండలమంతా విస్తృతంగా సోదాలు చేపట్టామని, గ్రామాల్లో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ ప్రజలకు సూచించారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి -పెనుకొండ

టిడిపి అధినేత చంద్రబాబు పెనుకొండ పర్యటనను విజయవంతం చేద్దామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సవితమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ఈ నెల 3వ తేదీ గొల్లపల్లి రిజర్వాయర్ పరిశీలనకు వస్తున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం, జగన్ సీమ రైతాంగాన్ని ఎలా మోసం చేశారో ప్రజలకు వివరించేందుకే చంద్రబాబు రాయలసీమ పర్యటనకు వస్తున్నారన్నారు. టిడిపి హయాంలో రూ. 12,441 కోట్లు ఖర్చు చేసి రాయలసీమలో అనేక పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి మొదటిసారి కృష్ణా నీళ్ల అనంతపురం జిల్లాకు తీసుకొచ్చారన్నారు. అలాగే మడకశిర బ్రాంచ్ కెనాల్‌లో అంతర్భాగమైన గొల్లపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి పెనుకొండ నియోజకవర్గంలో అనేక చెరువులకు నీళ్ల ఇచ్చారన్నారు. ముఖ్యంగా కియా ఇండస్ట్రియల్ హబ్ ద్వారా వేలాది మందికి ఉపాధి ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో అన్ని ప్రాజెక్ట్‌లను రద్దు చేసి జగన్ రాయలసీమ ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయాడన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రమౌళి, వెంకట రమణ, డివి ఆంజనేయులు, నరసింహులు, సోమశేఖర్, నంజప్ప, మారుతిప్రసాద్, కౌన్సిలర్ గీతా హనుమంతు, మరువపల్లి రాము, ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు ఈ నెల 3వ తేదీ ఉమ్మడి జిల్లాల పర్యటనను విజయవంతం చేద్దామని ఐ టిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి జయప్రకాష్ కోరారు.కియా మీదుగా పుట్టపర్తి నియోజకవర్గం లోని ఒడిసి మండలంలో పర్యటించనున్న ఆయన ఇక్కడ ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు దండు అరవింద్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మల్లికార్జున, కార్యనిర్వాహక కార్యదర్శి జస్వంత్, కార్యదర్శి కృష్ణాపురం నాయుడు, మాజీ సొసైటీ డైరెక్టర్ మండే జి ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది హత్య దారుణం

కదిరి టౌన్ : బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది రాయసం ఆదిశేషు విటల్ బాబునీ కిడ్నాప్ చేసి, అనంతరం హత్య చేయడం దారుణమని కదిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగాల లోకేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయవాది విటల్ బాబు మృతికి స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం ప్రకటించారు. మృతునికుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో తరచూ న్యాయవాదుల పై దాడులు, హత్యలు, తప్పుడు కేసులు నమోదు చేయటం వంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావలసిన అవసరం ఉందన్నారు, ఈ కేసులోని దోషులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చంద్రశేఖర్ రెడ్డి, పిడుగు రవీంద్ర బాబు, గురులింగ స్వామి, చౌడప్ప, శివశంకర్ రెడ్డి, కృష్ణమూర్తి, భైరవప్రసాద్, ఫైజుల్లా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

మడకశిర : పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం దళిత హక్కుల పరిరక్షణ సమితి (డిహెచ్‌పి ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్.హనుమంతు నగర పంచాయతీ నూతన కమిషనర్ గోపాల్‌రెడ్డికి వినతిపత్రి అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మధుగిరి రోడ్డులోని రాజీవ్‌గాంధీ సర్కిల్, పెనుకొండ రోడ్డులోని వాల్మీకి సర్కిల్, హిందూపురం రోడ్డులోని అంబేద్కర్ సర్కిళ్ల నిత్యం ప్రయాణికుల తో రద్దీగా ఉంటాయన్నారు. అయిగే ఆ ప్రాంతాల్లో మరుగుదొడ్ల లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మాంసం దుకాణాల వల్ల దుర్వాసన వెదజల్లుతుందని, వాటి వ్యర్థాల వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయన్నారు. ఊరి బయట శాశ్వత భవనాలతో మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. లేనిచో డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

మాతాశిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా మాతా, శిశు మరణాలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లాలోని ఆరోగ్య వైద్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగుల పట్ల సకాలంలో స్పందించాలని, ప్రైవేట్ అంబులెన్స్, ఆసుపత్రులు నిర్వాహకులను అనంతరం జరిగే సమావేశానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన 17 మాతా శిశు మరణాలకు గల కారణాలను వెంటనే తెలియజేసి అవి పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వైద్యాధికారి సెల్వియా సోలోమాన్, డాక్టర్ డి. కృష్ణయ్య, డిసిహెచ్‌ఎస్ తిపేంద్ర నాయక్, మంజువాణి, డిప్యూటీ డిఎంహెచ్ఓ కెసికె నాయక్, డాక్టర్ పద్మలతతో పాటు జిల్లాలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

పజాశక్తి-రొళ్ల

"పడకేసిన పారిశుధ్యం" అనే శీర్షికతో సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారుల్లో చలనం వచ్చింది. దీంతో ఉదయాన్నే అధికారులు అగలి రోడ్డులో కుప్పలు కుప్పలుగా ఉన్న చెత్తను స్వచ్ఛభారత్ కార్మికుల చేత తొలగించి పారిశు ధ్యం పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పచ్చదనం పెంపునకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

పచ్చదనం అభివృద్ధిపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు తెలిపారు కొత్తచెరువులోని జూనియర్ కళాశాల, కొడపగానిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల పాఠశాల ఆవరణంలో, ప్రభుత్వ స్థలాలలో మొక్కలను విరివిగా నాటి పచ్చదనం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి, పాఠశాల హెచ్ఎం చలపతి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వర్ సాకుతో మందకొడిగా ఓటరు ప్రక్రియ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

సర్వర్ సాకుతో బిఎల్‌ఒలు ఓటర్ ప్రక్రియ మందకొడిగాచేస్తున్నారని, వివిధ పార్టీల నాయకులు తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని అన్ని పార్టీల నాయకులతో తహశీల్దార్ నాగేంద్ర సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఎల్‌ఒల తీరుపై పలువురు నాయకులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహశీల్దార్ సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు తుమ్మల మనోహర్, నారాయణస్వామి, బాసినేని ప్రభాకర్, నిషార్ అహమ్మద్, నారాయణస్వామి, బాల భాస్కర్, చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.